# సాక్షి మంచిర్యాల

బుధవారం। 5 । జూలై। 2023






**బడికి నిధులు..!**

సర్కార్ బడులకు ప్రభుత్వం మొదటివిడత నిధులు విడుదల చేసింది. జిల్లాకు రూ.22.80 లక్షల స్పోర్ట్స్, రూ.75.85లక్షల స్కూల్ గ్రాంట్ నిధులు విడుదలయ్యాయి. 8లో▸



**'మట్టి'తోడేస్తున్నారు..!**

ప్రభుత్వ భూముల నుంచి మట్టి యథేచ్ఛగా తరలిపోతోంది. అక్రమార్కులు చెరువులు, గుట్టల నుంచి తీసిన మట్టిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

**వాతావరణం**

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### ఆలయ హుండీ లెక్కింపు

**దండేపల్లి:** మండలంలోని గూడెం శ్రీసత్య నారాయణస్వామి ఆలయానికి మార్చి 29 నుంచి జూలై 4వ తేదీ వరకు హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రూ.8,66,702 ఆదాయం సమకూరింది. దేవాదాయశాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ లెక్కింపులో ఆలయ ఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు రఘుస్వామి, వేదపండితుడు నారాయణశర్మ, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మినీ ట్యాంక్‌బండ్‌గా గాలికుంట



గాలికుంటను పరిశీలిస్తున్న అధికారులు

**చెన్నూర్:** పట్టణంలోని బేతాళవాడ సమీపంలోగల జాతీయ రహదారి పక్కనున్న గాలికుంట (అనంతయ్యకుంట)కు మహర్దశ పట్టనుంది. సోమవారం పట్టణంలో పర్యటించిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్ గాలికుంటను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. విప్ ఆదేశాల మేరకు మంగళవారం ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు గాలికుంటను పరిశీలించారు. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి సుమారు రూ.4 కోట్ల నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించనున్నారు. గాలికుంటను అభివృద్ధి చేస్తే బేతాళవాడ, ఇందిరానగర్, దుబ్బగూడెం, పెద్దవాడ, అంబేద్కర్ కాలనీల వాసులకు మేలు జరుగుతుంది. కార్యక్రమంలో కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, పెండ్యాల స్వర్ణలత లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మున్సిపల్ ఏఈ సాయికిరణ్, ఇరిగేషన్ ఏఈలు సందీప్, హరికృష్ణ పాల్గొన్నారు.

### విచారణాధికారిగా డెప్యూటీ డీఎంహెచ్‌వో

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి నిత్య పిల్లల ఆస్పత్రిలో మూడు నెలల బాబు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టేందుకు విచారణాధికారిగా డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూర్ణిమను నియమించినట్లు డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు తెలిపారు. తాండూర్ మండల కేంద్రం ఐబీ కొత్తగుడిసెల ప్రాంతానికి చెందిన జాడి కిషన్–కళావతి దంపతుల మూడు నెలల బాబు స్వల్ప జ్వరంతో బాధ పడగా నిత్య పిల్లల ఆస్పత్రిలో చేర్చారు. నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతో బాబు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇప్పటికే నిత్య పిల్లల ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందిపై వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. విచారణాధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలకు సిఫారసు చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

### ఊరటనిచ్చిన వర్షం

**మంచిర్యాలఅగ్రికల్చర్:** తొలకరి వర్షాలు మురిపించి కొద్దిరోజులు మొహం చాటేయగా రెండ్రోజులుగా కురుస్తున్న వానలు రైతులకు ఎంతో ఊరటనిచ్చాయి. మంగళవారం జిల్లాలో భారీ వర్షం కురియగా 22.6 మిల్లీ మీటర్లుగా నమోదైంది. ఇది మెట్ట పంటలకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. మరో రెండ్రోజులు వానలు కురియనున్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు విత్తనాలు వేయని రైతులు విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. వాగులు, ఒర్రెలు, చెరువులు, కుంటల్లోకి కొత్తనీరు చేరుతోంది. క్రమేపి జలాశయాల్లోకి నిల్వలు పెరుగుతుండగా అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3.63 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 89 వేల ఎకరాల్లో విత్తుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రెండ్రోజులుగా కురుస్తున్న వానలతో రైతులు పొలంబాట పడుతున్నారు. ఇప్పటికే విత్తుకున్న పత్తి, మొక్కజొన్న, కంది, పెసర పంటలకు ఈ వానలు జీవం పోశాయి.

### 'ప్రథమ స్థానంలో నిలపాలి'

**నెన్నెల:** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో చిత్తాపూర్ పంచాయతీని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు, పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని జెడ్పీ సీఈవో నరేందర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చిత్తాపూర్ గ్రామాన్ని సందర్శించి మొక్కలు నాటారు. గ్రామపంచాయతీ నర్సరీ, గ్రామాభివృద్ధిని పరిశీలించి సమావేశం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ బాగుందని సర్పంచ్ బత్తిని పద్మను అభినందించారు. చిత్తాపూర్ పంచాయతీకి అవార్డు రావాలంటే ఓవర్‌గ్యాస్, డంప్‌యార్డు, ఇంకుడుగుంతలు, వాల్‌రైటింగ్ చేయాలని సూచించారు. మరుగుదొడ్లు వందశాతం ఉపయోగించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, మల్లాగౌడ్ ఉన్నారు.

# ఆస్తిపన్ను వసూలు అంతంతే..



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

- ఆకట్టుకోని 'వడ్డీ రాయితీ' స్కీం
- గత నెల 30తో ముగిసిన గడువు
- లక్ష్యం పూర్తిచేయని బల్దియాలు
- సగానికి చేరుకున్న 'లక్సెట్టిపేట'
- మిగతా చోట్ల పాతికశాతం లోపే..

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూలు అంతంత మాత్రంగానే ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయిల వసూలు కోసం మున్సిపల్ అధికారులు, బిల్ కలెక్టర్లు బకాయిదారులకు నోటీసులిచ్చారు. గత నెల 30వ తేదీవరకు వడ్డీ రాయితీతో చెల్లింపు గడువు తీరింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి పన్ను బకాయిలపై 2శాతం వడ్డీ వసూలు చేయనున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో డిమాండ్ రూ.16.82 కోట్లు కాగా, రూ.4.22 కోట్లు వసూలైంది. ఇంకా రూ.12.60 కోట్లు వసూలు కావాల్సి ఉంది. బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరిగినా.. బకాయిదారులకు నోటీసులిచ్చినా వసూళ్లు మాత్రం అంతంతగానే ఉన్నాయి. బకాయిదారులకు నోటీసులిచ్చి తదుపరి చర్యలు తీసుకోకపోవడంతోనే వసూళ్లు తగ్గాయి. గ్రేడ్–1 మున్సిపాలిటీగా ఉన్న మంచిర్యాలకు వివిధ నిధులు ప్రభుత్వం నుంచి వస్తుండడంతో పన్ను వసూళ్లపై అధికారులు, పాలకవర్గం అంతగా దృష్టి సారించలేదని తెలుస్తోంది.

**సగానికి చేరుకున్న లక్సెట్టిపేట లక్ష్యం**

**లక్సెట్టిపేట:** లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు సగం వరకు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 5,738 నివాస గృహాలుండగా ఆస్తిపన్ను వసూలు డిమాండ్ రూ.1.43కోట్లుగా ఉంది. ఇప్పటివరకు రూ.68.75 లక్షలు వసూలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**చెన్నూర్‌లో 12శాతమే..**

**చెన్నూర్:** 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను చెన్నూర్ మున్సిపాలిటీలో 6,517 నివాస గృహాలుండగా ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.1.44 కోట్లుగా నిర్దేశించారు. జూన్ 30 వరకు రూ.26.70 లక్షలు వసూలైంది. 12 శాతమే వసూలు చేశారు. జూన్ 30 నాటికి ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉన్నప్పటికీ ఎవరూ పెద్దగా ముందుకు రాలేదు. గతేడాది ఆస్తి పన్ను లక్ష్యం రూ.1.22 కోట్లు కాగా, రూ.75.03 లక్షలు వసూలు చేసి 50 శాతం చేరుకుంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆస్తి పన్ను వసూలు పూర్తిగా తగ్గింది. ఈ ఏడాది భువన్ సర్వే నిర్వహించగా సిబ్బంది రెండు నెలల పాటు పాల్గొన్నారు. ఈ సర్వే కారణంగా ఈ ఏడాది ఆస్తి పన్ను బకాయిలు పెరిగాయి. దీంతో గడువులోగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయామని అధికారులు తెలిపారు. జూన్ 30తో ఆస్తి పన్ను వడ్డీ రాయితీ గడువు ముగియడంతో జూలై నుంచి ప్రతీ నెల వడ్డీ శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లిస్తేనే మేలు జరుగుతుందని కమిషనర్ గంగాధర్ తెలిపారు.

**చతికిలపడ్డ బెల్లంపల్లి..**

**బెల్లంపల్లి:** ఆస్తిపన్ను వసూలులో బెల్లంపల్లి మున్సిపాలిటీ వెనుకంజలో ఉంది. నిర్ణీత గడువులోగా లక్ష్యాన్ని చేరుకోలేక చతికిల పడింది. ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.6.38 కోట్లు కాగా, రూ.72 లక్షలు మాత్రమే వసూలు చేయగలిగారు. ఇంకా రూ.5.66 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇందుకు మున్సిపల్ అధికారులు పలు కారణాలు చెబుతుండగా సగం కూడా పూర్తి చేయలేకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. మున్సిపాలిటీలో 16,320 పక్కాగృహాలు ఉండగా దాదాపు 40 శాతం వరకు శిథిలావస్థకు చేరాయి. వీటిని రికార్డుల నుంచి తొలగించాల్సి ఉండగా ఆ ప్రక్రియ జరగలేదు. దీంతో ఇళ్ల సంఖ్య రికార్డుల్లో అధికంగా ఉండి ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.కోట్లకు వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. కారణాలేమైనా ఆస్తిపన్ను వసూలులో 50 శాతం కూడా దాటక పోవడం చర్చనీయాంశమైంది.



బెల్లంపల్లి బల్దియా కార్యాలయం

**నస్పూర్‌లో అత్యల్పంగా 6.49శాతమే..**

**నస్పూర్:** పట్టణ పరిధిలో 6.49శాతమే ఆస్తిపన్ను వసూలైంది. 15,900 అసెస్‌మెంట్లుండగా డిమాండ్ రూ.7.10 కోట్లుగా ఉంది. ఇందులో గడువులోగా రూ.46.11లక్షలు వసూలు కాగా, ఇంకా రూ.6.64 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ఇందులో సింగరేణి సంస్థ చెల్లించాల్సింది రూ.3.84కోట్లు. సింగరేణి సంస్థ గతంలో పంచాయతీ లెక్కల ప్రకారం ఏడాదికి రూ.49 లక్షల ఆస్తిపన్నును మున్సిపాలిటీకి చెల్లించేది. నస్పూర్, తీగల్‌పహాడ్, తాళ్లపల్లి, సింగాపూర్ పంచాయతీలను కలిపి 2018లో నస్పూర్ మున్సిపాలిటీగా ఏర్పడింది. మున్సిపల్ చట్టం ప్రకారం కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో మూడేళ్ల పాటు పాత పద్ధతిలో ఆస్తిపన్ను చెల్లించాలి. ఆ తర్వాత నుంచి పెరిగిన ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కొత్త చట్టం ప్రకారం ఆస్తిపన్నును రివిజన్ చేశామని, ప్రతి ఒక్కరూ ఆస్తిపన్ను చెల్లించాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు.

## నేడు వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** వానాకాలం సాగుపై 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం 'ఫోన్ ఇన్' నిర్వహించనుంది. జూలై వచ్చినా ఆశించిన వర్షాలు లేకపోవడం, పంటలు విత్తుకునేందుకు అదను, పదును, సమయం, నకిలీ విత్తనాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఏయే పంటలు సాగుకు అనుకూలం తదితర అంశాలపై రైతుల సందేహాలను జిల్లా సహాయ వ్యవసాయాధికారి బి.అనిత నివృత్తి చేయనున్నారు. రైతులు ఫోన్లు చేసి సాగుపై అనుమానాలు, ఇబ్బందులపై సలహాలు, సూచనలు పొందవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

**సమయం :** బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :

**72888 94017**(ఏడీఏ), **94936 56787**(ఏవో)

## రోజుకు 2లక్షల టన్నుల టార్గెట్



**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** సింగరేణి కాలరీస్ ఈ ఆర్థిక సంవత్సరం 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు నిర్ణయించింది. ఇందుకు వచ్చే మూడు నెలలు రోజుకు 2లక్షల టన్నుల ఉత్పత్తి చేసేందుకు సిద్ధమైంది. ఏటా వానాకాలంలో ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. గతేడాది అధికంగా కురిసిన వర్షాలకు బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఇబ్బందులెదురయ్యాయి. ముఖ్యంగా ఓసీపీల్లో ఉత్పత్తి అధికంగా ఉండి, వానాకాలంలో బొగ్గు తీసేందుకు సమస్య ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఈ వానాకాలంలో ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ ఏరియాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంగళవారం జీఎంలను ఆదేశించారు. ఈ త్రైమాసికంలో సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తిపై చర్చించారు. గతేడాది వర్షాలతో రెండో త్రైమాసికంలో బొగ్గు ఉత్పత్తి తగ్గింది. ఈ ఏడాది ఇంకా వానలు కురవకపోవడంతో తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. వానలు కురిస్తే ఓసీపీల్లో భారీ పంపులతో నీటి నిల్వ లేకుండా ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఆశించిన వృద్ధి సాధించగా, రెండో త్రైమాసికంలోనూ అదే స్ఫూర్తితో లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. కంపెనీ వ్యాప్తంగా వానాకాలంలో ఓసీపీల్లో రోజుకు సగటున కనీసం 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలనే లక్ష్యం ఉంది. ఈ లక్ష్యం చేరుకునేందుకు ఈ నెలలో రోజువారీగా ఒక్కో ఏరియాకు ఎంతెంత ఉత్పత్తి చేయాలో లక్ష్యాలను చైర్మన్, ఎండీ శ్రీధర్ నిర్దేశించారు. ఇందులో జిల్లాలోని శ్రీరాంపూర్ ఏరియా 19వేల టన్నులు, బెల్లంపల్లి 14వేల టన్నులు, మందమర్రి ఏరియా 12 వేల టన్నులుగా ఉంది. ఈ లక్ష్యాలను వచ్చే మూడు నెలల్లో చేరుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు వర్షాలు లేకపోవడంతో ఉత్పత్తి సజావుగా సాగుతోంది. వర్షాలు పడితే ఓసీపీల్లో ఓబీ తొలగింపు, బొగ్గు వెలికితీత తొలగింపు, రవాణాకు అంతరాయం కలగనుంది.

## కాంగ్రెస్‌లో చేరిన నీలకంఠేశ్వరరావు



నీలకంఠేశ్వరరావుకు కండువా వేస్తున్న రేవంత్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** ప్రముఖ ఈఎన్టీ వైద్యుడు, చార్వాక సొసైటీ అధ్యక్షుడు, బీసీ సంఘం, 'గోప' జిల్లా అధ్యక్షుడు ఎం.నీలకంఠేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కండువా కప్పుకొన్నారు. మొదట జూబ్లీ హిల్స్ పెద్దమ్మగుడి నుంచి తన అనుచరులతో రేవంత్‌రెడ్డి ఇంటివరకు ర్యాలీగా వెళ్లారు. ఆయనతో పాటు ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు గొల్లపల్లి దయాకర్‌రావు, భారత్ వాగ్మరే, కార్మిక నాయకుడు ఎంసీ రెడ్డి తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించి, చట్ట సభల్లో సముచిత న్యాయం కల్పిస్తోందనే నమ్మకంతోనే పార్టీలో చేరానని చెప్పారు. నీలకంఠేశ్వరరావు గతంలో ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా, ప్రజారాజ్యం పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేశారు. 2009లో ప్రజారాజ్యం టికెట్ దక్కకపోవడంతో మంచిర్యాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కొంతకాలంగా గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు, సొసైటీ, ప్రజా, బీసీ సంఘాలతో సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. మంచిర్యాల నియోజకవర్గం నుంచి బీసీ కోటాలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు.

## జేసీబీ కేసులో ఎస్సైపై వేటు

- సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** భీమారం పోలీస్‌స్టేషన్‌లో జేసీబీ మాయంపై అప్పటి జైపూర్ ఎస్సై రామకృష్ణపై వేటు పడింది. నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్‌లో సీజ్ చేసిన జేసీబీని విడిచిపెట్టడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీనిపై శాఖాపరంగా విచారణ చేపట్టిన అధికారులు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం రామకృష్ణ పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి ఠాణాలో పని చేస్తున్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులు మూడు రోజుల క్రితమే వచ్చినట్లు సమాచారం. దీనిపై మంగళవారం డీసీపీ రామ్‌నాథ్ కేకన్‌ను సంప్రదించగా, జేసీబీని విక్రయించిన ఘటనలో ఎస్సై రామకృష్ణ సస్పెండ్ అయ్యారని స్పష్టం చేశారు. 2018లో భీమారం మండలం మాంతమ్మ గుడి వద్ద గుప్త నిధుల తవ్వకాల కేసులో ఓ జేసీబీ, బైక్ పట్టుబడింది. అయితే భీమారం పోలీస్‌స్టేషన్‌లో స్థలాభావంతో జేసీబీని జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఎస్సై రామకృష్ణ స్టేషన్‌లో క్వార్టర్లు, పాత భవనాలను కూల్చి పునర్నిర్మాణం చేసే క్రమంలో పట్టుబడిన జేసీబీని కూడా అప్పగించారు. ఆ జేసీబీని ఇవ్వగా వారు వేరే వ్యక్తులకు అమ్మేశారు. వాస్తవానికి ఆ జేసీబీ జైపూర్ పవర్‌ప్లాంట్‌లో లీజ్ ప్రాతిపదికన నడిచిన హర్యానాకు చెందిన వ్యక్తిది. ఈ కేసులో జేసీబీని తిరిగి తీసుకురావాలని ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో నారాయణపేట జిల్లా నుంచి తిరిగి ఠాణాకు చేరింది. ఏదైనా కేసులో యంత్రం మరేదైనా పట్టుబడితే కోర్టు ఉత్తర్వులతో చట్ట ప్రకారం విడుదల చేయాలి. కానీ.. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా అప్పగించడంతో ఎస్సైపై వేటు పడింది. అయితే జేసీబీని విడిచిపెట్టేలా ఉత్తర్వులు వస్తాయనే నమ్మకంతోనే ముందస్తుగా విడిచిపెట్టి ఎస్సై ఇబ్బంది పాలైనట్లు డిపార్ట్‌మెంట్‌లో చర్చించుకుంటున్నారు.

## 'ఖాకీ' తీరుపై కలకలం

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** జిల్లాలో పోలీస్ అధికారి ఓ మహిళను గర్భవతిని చేసి అబార్షన్ చేయించిన ఘటన కలకలం రేపుతోంది. జిల్లాలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఓ మహిళతో సన్నిహితంగా ఉంటూ శారీరకంగా వాడుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలోనే గర్భస్రావం చేయించినట్లు తెలిసింది. ఆమెకు రూ.10 లక్షల వరకు అప్పజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు ఆ పోలీస్ అధికారి మామనే మధ్యవర్తిత్వం చేసినట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా పోలీస్ ఉన్నతాధికారి దృష్టికి విషయం వెళ్లగా ఈ ప్రచారంలో వాస్తవమెంత అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం పోలీస్ వర్గాల్లోనే కాక, జిల్లా ప్రజాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. అయితే ఇందులో నిజమెంత? అనేది పూర్తిస్థాయిలో వివరాలు బహిర్గతం అయితేనే తేలనుంది.

## పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

**పాతమంచిర్యాల:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కడెం నుంచి తుమ్మిడిహెట్టి వరకు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో మంగళవారం ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే నిర్మించి ఉమ్మడి జిల్లాలో పంట పొలాలకు నీరందకుండా చేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి మల్లన్నసాగర్‌లో నింపుతున్నారని అక్కడి నుంచి హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు నీళ్లు పంపిస్తామని, అక్కడ పెద్ద రిజర్వాయర్ నిర్మించి మరో కొత్త రిజర్వాయర్ నిర్మించి అభివృద్ధి చేస్తామని చెప్పించి 111జీవో ఎత్తివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారమే ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. రైతులపై కేసీఆర్‌కు ప్రేమలేదని, వెనుకబడిన ప్రాంతాలపై శ్రద్ధ లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కేసీఆర్ జిల్లాకు చేసిన మోసాలు, నష్టాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కడెం నుంచి తుమ్మిడిహెట్టి వరకు పర్యటించి ప్రజలను కలుస్తామని, ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓట్లు అడిగే అర్హత కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జనసమితి నాయకులు బాబన్న, నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ విఠల్, కాంగ్రెస్ నాయకులు కేవీ.ప్రతాప్, తెలంగాణ జల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ నైనాల గోవర్ధన్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు జైపాల్‌సింగ్, దేవి సత్యం, సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ నాయకులు టి.శ్రీనివాస్, తోకల తిరుపతి పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి




ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

**మంచిర్యాలఅగ్రికల్చర్:** పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో డీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడారు. కొంతకాలంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దీంతో ఈ నెల 6నుంచి సమ్మెలో పాల్గొననున్నట్లు నోటీస్ అందించినట్లు చెప్పారు. గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు తమను సొంత పనులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి మండలం చిన్నబూద గ్రామంలో విధుల్లో విద్యుత్ షాక్‌తో మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు దాసరి సురేశ్, రాజలింగు, లచ్చన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'పోడు' లబ్ధిదారులకు పట్టాలు



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆర్డీవో శ్యామలాదేవి

**బెల్లంపల్లి:** ఏఎంసీ ఏరియా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం ఆర్డీవో శ్యామలాదేవితో కలిసి లబ్ధిదారులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. కన్నాల పంచాయతీ పరిధిలో తొమ్మిది మందికి, పెర్కపల్లి పంచాయతీ పరిధిలో ఐదుగురికి అందజేశారు. ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచులు, నాయకులున్నారు.

**తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామంలోగల సింగరేణి కమ్యూనిటీహాల్‌లో 764 ఎకరాల పోడు భూమి సాగు చేస్తున్న 224 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చిన్నయ్య పట్టాలు అందజేశారు. ఆర్డీవో కె.శ్యామలాదేవి, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు శంకర్, యశోద, విండో చైర్మన్ దత్తుమూర్తి, నాయకులు రహమత్, తిరుపతి, మంగీలాల్, రజిత, జంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

## 'పనులు త్వరగా పూర్తి చేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నస్పూర్:** 'మన ఊరు–మన బడి' పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో 'మన ఊరు–మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులపై విద్యాశాఖాధికారి యాదయ్య, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి 'మన ఊరు– మన బడి' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 248 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఆయా పాఠశాలల్లో పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలకు సంబంధించిన కాంపోనెంట్స్, ఈజీఎస్ కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీకి సంబంధించిన వివరాలతో నివేదిక అందించాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఈఈలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏజెన్సీలకు సంబంధించిన ఈఈ, డీఈ, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా విక్రేతలతో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

**భీమిని(బెల్లంపల్లి):** కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెట్‌పల్లిలో మంగళవారం ఎక్సైజ్, పోలీసులు దాడులు నిర్వహించారు. తమకు అందిన సమాచారం మేరకు కన్నెపల్లి ఎస్సై నరేష్, ఎక్సైజ్ ఎస్సై నిర్మల సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన దుమ్మ భాగ్యలక్ష్మి, ఎల్లా శేఖర్, బొక్కలాల శేఖర్, కడాల సుధాకర్ వద్ద నుంచి ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, పట్టుకున్న గుడుంబాను ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు కన్నెపల్లి ఎస్సై నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎక్సైజ్ ఎస్సై నిర్మల పేర్కొన్నారు.

### హత్య కేసులో తల్లీకూతుళ్ల రిమాండ్

**దహెగాం:** హత్య కేసులో తల్లీకూతుళ్లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన వెల్మలే పుల్లయ్యను అతని భార్య మంగ, కూతురు తేజరాణి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. పుల్లయ్య తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడని, ఈ నెల 1న మధ్యాహ్నం మద్యం సేవించి ఇంట్లో గొడవ పడడంతో భార్య, కూతురు కలిసి హత్య చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని సోదరుడు హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ చేపట్టి తల్లీకూతుళ్లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



మల్లేశ్ మృతదేహం

**రెబ్బెన(ఆసిఫాబాద్):** పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నవేగాం గ్రామానికి చెందిన బోయిని మల్లేశ్ (35) రోజు మాదిరిగానే మంగళవారం గొర్రెలను మేపేందుకు కొండపల్లి పరిసరాలకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.



# బడికి నిధులు..!

- నిర్వహణ కోసం మొదటి విడత విడుదల
- ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున కేటాయింపు
- క్రీడా నిధులు సైతం మంజూరు



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

**మంచిర్యాలఅర్బన్:** సర్కారు బడుల నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం సుద్దముక్క (చాక్‌పీస్) కొనుగోలుకు కూడా పైసలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలలను నిధుల కొరత వేధిస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లోనైనా నిధులు సకాలంలో విడుదలవుతాయని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బులు వెచ్చించారు. ఎట్టికేలకు ఈ విద్యాసంవత్సరం 2023–24లో పాఠశాల శుభ్రత, ఇతర నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులను ఈ నెల 3న విడుదల చేసింది. ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్యను బట్టి తొలి విడతగా 50 శాతం నిధులు మంజూరయ్యాయి.

**నిధుల మంజూరు ఇలా..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి బడి నిర్వహణ నిధులు మంజూరు చేస్తోంది. రెండు విడతల్లో నిధులు కేటాయిస్తారు. సుద్దముక్కలు (చాక్‌పీస్)లు, తరగతి గదులు శుభ్రం చేసే చీపుర్లు, రిజిస్టర్లు, ఇతర ఖర్చుల కింద నిధులు వినియోగిస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయించారు. 1 నుంచి 30 మంది విద్యార్థులకు రూ.10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25 వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మందికి రూ.75వేలు, వెయ్యికి పైగా విద్యార్థులకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

**క్రీడా నిధులొచ్చాయ్..**

స్కూల్ గ్రాంటు నిధులతో పాటు ప్రభుత్వం స్పోర్ట్స్ గ్రాంటు నిధులు కూడా విడుదల చేయడం క్రీడాకారులకు ఉపశమనం కలిగిస్తోంది. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంటు యుటిలైజేషన్ గైడ్‌లైన్స్ జారీ చేసింది. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 8వ తరగతి, 9 నుంచి 12వ తరగతికి సమగ్ర శిక్ష కింద ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌ల కోసం క్రీడా పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, సాఫ్ట్‌బాల్, టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బీన్‌బ్యాగ్స్, సాకర్‌కోన్, షాట్‌పుల్, డిస్కస్, ఫోమ్ జావెలిన్ తదితర పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రీడా పరికరాలతో పాటు అదనంగా స్కిప్పింగ్ రోల్, వాలీబాల్, త్రోబాల్, ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా నిధులు మొదటి విడతలో 50 శాతం మంజూరయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు.

**ఉమ్మడి జిల్లాలో స్పోర్ట్స్ నిధులు**

| జిల్లా | స్కూల్స్ | మొత్తం నిధులు | మొదటిదఫా మంజూరు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 1,098 | రూ.65,30,000 | రూ.32,65,000 |
| కుమురంభీం | 937 | రూ.54,30,000 | రూ. 27,15,000 |
| నిర్మల్ | 719 | రూ.45,50,000 | రూ.22,75,000 |
| మంచిర్యాల | 720 | రూ.45,60,000 | రూ.22,80,000 |

**స్కూల్ గ్రాంటు నిధులు**

| జిల్లా | స్కూల్స్ | మొత్తం నిధులు | మొదటిదఫా మంజూరు |
|---|---|---|---|
| మంచిర్యాల | 720 | రూ.1,51,70,000 | రూ.75,85,000 |
| ఆదిలాబాద్ | 1,098 | రూ.2,31,45,000 | రూ.1,15,72,500 |
| కుమురంభీం | 937 | రూ.1,81,40,000 | రూ.90,70,000 |
| నిర్మల్ | 719 | రూ.1,79,50,000 | రూ.89,75,000 |

## 35శాతం లాభాల వాటా చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

**శ్రీరాంపూర్:** సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాల్లోంచి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్కే 7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందంలో బీఎంఎస్ కృషి ఫలితంగానే వేతనాలు పెరిగాయన్నారు. తమ యూనియన్ వేజ్ బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి వేతన ఒప్పందం కోసం కోలిండియా యాజమాన్యంపై ఒత్తిడి తేవడం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రితో సంప్రదింపులు జరపడం వల్లే నూతన ఒప్పందం త్వరితగతిన జరిగిందన్నారు. మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతం, 25 శాతం అలవెన్సులు పెరిగాయన్నారు. ఇది చరిత్రాత్మక ఒప్పందం అన్నారు. సింగరేణిలో ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాంపల్లి తిరుపతి, మహేందర్ వర్మ, బుర్ర అరుణ్ గౌడ్, మంద కమలాకర్, సంపత్ పాల్గొన్నారు.

### విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి

**కాగజ్‌నగర్‌టౌన్:** కూలర్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఆదర్శ్‌నగర్ కాలనీకి చెందిన తన్నీరు సుశీల (68) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. సోమవారం రాత్రి కూలర్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. ఈక్రమంలో ఆమెపై కూలర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం ఉదయం బంధువులు వచ్చి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలికి నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

### మందమర్రికి చేరిన పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న బాబురావు, శోభ

**మందమర్రిరూరల్:** రాష్ట్రంలో, దేశంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని, కేసీఆర్ ప్రధాన మంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజురాకు చెందిన ముస్కే బాబురావు, శోభ దంపతులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం మందమర్రికి చేరుకుంది. నల్లని దుస్తులు ధరించి చేతి, మెడకు బేడీలు వేసుకుని కేసీఆర్ చిత్రపటంతో కూడిన బ్యానర్ చేతపట్టుకుని పాదయాత్ర చేపట్టారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని, కేసీఆర్ ప్రధాని అయితే దేశవ్యాప్తంగా పథకాలు అమలవుతాయని వారు పేర్కొన్నారు. అనంతరం అందుగులపేట, పులిమడుగు మీదుగా మంచిర్యాలకు వెళ్లారు.

### పలువురి బైండోవర్



బైండోవర్ అయిన యువకులు

**రామకృష్ణాపూర్(చెన్నూర్):** రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రిపూట బయట తిరుగుతూ గొడవలకు పాల్పడుతున్న పలువురు యువకులను మంగళవారం బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్సై అశోక్ తెలిపారు. ప్రజా జీవనానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్న మధుకర్, రాజ్‌కుమార్, అజయ్, సందీప్, శేఖర్, కుమార్, ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

### సైబర్ వలలో చంద్రవెల్లి యువకుడు

**బెల్లంపల్లిరూరల్:** ఆన్‌లైన్‌లో మోసానికి ఓ యువకుడు బలై డబ్బులు పోగొట్టుకున్నట్లు తాళ్లగురిజాల ఏఎస్సై రాజన్న తెలిపారు. మండలంలోని చంద్రవెల్లికి చెందిన బూర శివ మొబైల్‌కు గత నెల 8 న 84588771421 నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. ఆ నంబర్‌తో చాట్ కొనసాగించగా ఒక కోడ్ పంపి దానిని వాల్లిస్ అనే టెలిగ్రామ్ అకౌంట్‌కు పంపిస్తే రూ.50 చెల్లిస్తామని చెప్పడంతో అలాగే చేశాడు. దీంతో వారు రూ.50 శివ అకౌంట్‌కు పంపించారు. 12న మేసేజ్ పంపడంతో రూ.వెయ్యి పంపించాడు. బదులుగా రూ.1300 అకౌంట్‌లో జమ చేశారు. మరుసటి రోజు రూ.6వేలు పంపించగా బదులుగా రూ.7,800 జమ చేశారు. 13న రూ.25 వేలు పంపించమనడంతో ఆ నగదును వారి అకౌంట్‌కు పంపించాడు. మూడు నాలుగు రోజులు గడిచినా నగదు రాకపోవడంతో మోసపోయానని గుర్తించి వెంటనే 1930 నంబర్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు ఆ నగదును ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజన్న తెలిపారు.

### బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

**కాగజ్‌నగర్‌రూరల్:** ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వి వరాల ప్రకారం మండలంలోని కోసిని గ్రామ పంచాయతీలోని రాంనగర్‌కు చెందిన సిగ కొమురమ్మ (70)మంగళవారం కిరాణా దుకాణానికి వెళ్తుండగా బైక్‌పై వస్తున్న అదే గ్రామానికి చెందిన అబ్దుల్ ముజాహిద్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డి మాండ్ చేస్తూ గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి కుమారుడు రాజ్‌కుమా ర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సోనియా తెలిపారు.

### బోదకాలు నివారణపై అవగాహన

**నస్పూర్:** బోదకాలు, నులిపురుగుల నివారణపై మంగళవారం జిల్లా వైద్యాధికారులు పట్టణంలోని కేజీబీవీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అనిత, నస్పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సమత, ఎస్‌వో మానిక, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### అద్దెవాహన యజమానులతో చర్చలు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** సింగరేణి అద్దె వాహనాల నిర్వహణ సమస్యలపై బెల్లంపల్లి ఏరియాకు చెందిన వాహన యజమానులు సమ్మె నోటీసు అందించిన నేపథ్యంలో మంగళవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్ వాహనాల యజమానులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వాహన యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా తమవంతు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం నరేందర్, డీజీఎం రామారావు, ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, ఈఈ పర్చేస్ రవి, తదితరులు పాల్గొన్నారు.

### 'మధ్యాహ్న' కార్మికుల ధర్నా

**మంచిర్యాలఅర్బన్:** సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు పద్మ, అంజలి, లక్ష్మి, గట్టమ్మ, పోసక్క, భాగ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

**భీమారం:** హరితహారాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీవో దత్తారావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించగా దత్తారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో ఉపాధిహామీ కింద చేపట్టనున్న హరితహారం కోసం వెంటనే మొక్కలు పంపిణీ చేయాలని, గ్రామగ్రామాన ఇంటికి ఆరు మొక్కల చొప్పున అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

**శ్రీరాంపూర్:** సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏరియర్స్ ఎప్పుడు చెల్లిస్తారో ముఖ్యమంత్రి తేదీని ప్రకటించాలన్నారు. జాతీయ సంఘాల సమష్టి కృషి, కార్మికుల ఐక్యతతోనే 11వ వేతన ఒప్పందం మెరుగ్గా జరిగిందన్నారు. ఏ పరిశ్రమల్లో లేని విధంగా బొగ్గు గని కార్మికులకు వేతనాలు పెరిగాయన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని సంఘాలను సమానంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై జరిగే స్ట్రక్చర్ సమావేశాలు, మైన్స్, సేఫ్టీ కమిటీలలో అన్ని సంఘాల నేతలను ఆహ్వానించాలన్నారు. మహిళా కార్మికులను భూగర్భంలో దించే విధంగా కంపెనీ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ సెక్రెటరీ రంగశెట్టి శ్రీనివాస్, నాయకులు నంబయ్య, మల్లేశ్, బాలయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని యాజమాన్యం స్పందించని పక్షంలో ప్రత్యక్ష పోరాటాలకు పూనుకోవాలని ఏరియా కమిటీ తీర్మానించింది. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లపై రక్షిత మంచినీటి కొరత ఏర్పడుతోందన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ మజ్దూర్, ఎలక్ట్రీషియన్ల కొరత ఉందన్నారు. సమస్యలపై యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో నాయకులు మంగీలాల్, రాయలింగు, నర్సయ్య, చంద్రశేఖర్, రవీందర్, సమ్మయ్య, రాజేశం, సంపత్, పాల్గొన్నారు.

**ఎస్‌వోటూ జీఎంను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు**

బెల్లంపల్లి ఏరియా నూతన ఎస్‌వోటూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌ను మంగళవారం ఏరియా టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## భూవివాదంలో ఒకరు ఆత్మహత్యాయత్నం

**వేమనపల్లి(బెల్లంపల్లి):** మండలంలోని చామనపల్లిలో రెండు రోజులుగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంటోంది. ఇరువర్గాలకు జరుగుతున్న భూవివాదంలో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. చామనపల్లి వాగు నుంచి గ్రామ పొలిమేరలో కుశ్నపల్లి రోడ్డు వరకు వందలాది ఎకరాల వివాదాస్పద భూమి ఉంది. ఇది చెన్నూర్ రిజర్వు కంపార్ట్‌మెంట్ 124, 125కు వస్తుందని అటవీ అధికారులు తెలుపుతుండగా రెవెన్యూ రికార్డుకు 65, 67 సర్వే నంబర్లుగా ఉన్నట్లు రెవెన్యూ సిబ్బంది చెప్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వివాదాస్పద భూమిలో సుమారు 140 మందికి భూపంపిణీ కింద పట్టాలు ఇచ్చింది. కానీ కొందరికి తమభూమి ఎక్కడుందో ఇప్పటికీ తెలియదు. కొంతమంది మాత్రం 20 ఏళ్లుగా సాగు చేసుకుంటూనే ఉన్నారు. గ్రామానికి చెందిన నూకల చిన్న పర్వతాలు తాను సాగు చేసుకుంటున్న భూమిలో పది రోజుల క్రితం పత్తి విత్తనాలు విత్తాడు. దీంతో కొందరు ఆ భూమి తమదంటూ మొలకెత్తిన పత్తి మొక్కలను పీకేశారు. అదిచూసి తట్టుకోలేని పర్వతాలు మంగళవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతని భార్య పద్మ మందు డబ్బాను లాక్కోవడంతో ప్రాణా పాయం తప్పింది. బాధితుడు బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై సుబ్బారావు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అటవీ అధికారులు ఒక వర్గంతో కుమ్మక్కై వారి వద్ద డబ్బులు తీసుకుని దగ్గరుండి మొక్కలు పీకించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. అధికారులు క్షేత్ర స్థాయిలో జాయింట్ సర్వే చేసి పట్టాలు ఉన్నవారికి భూమిని చూపించి ఎలాంటి గొడవలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## భూతగాదాలో ఒకరు ఆత్మహత్యాయత్నం

**తాండూర్(బెల్లంపల్లి):** వారసత్వంగా వచ్చిన భూమిని సమానంగా పంపకం చేయలేదని ఆరోపిస్తూ ఒకరు మంగళవారం గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇడిదినేని వెంకటేశ్, లచ్చయ్య, రామయ్య ముగ్గురు అన్నదమ్ములు. వారసత్వంగా వచ్చిన భూమిని అందరికీ సమానంగా పంచలేదని వెంకటేశ్ కొంతకాలంగా అభ్యంతరం తెలుపుతున్నాడు. ఈ క్రమంలో లచ్చయ్య తన వాటా కింద వచ్చిన భూమిని అమ్మకానికి పెట్టాడు. ఈ క్రమంలో భూపంపకం చేయాలని వెంకటేశ్ పట్టుబట్టాడు. ఇందుకు లచ్చ య్య ని రాకరించడంతో తహసీల్దార్ కార్యాలయంలో ఫి ర్యాదు చేసి కోర్టులో కేసు కూడా వేశాడు. అయినా వి క్రయించేందుకు సిద్ధపడడంతో మనస్తాపం చెందిన వెంకటేశ్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తనచావుకు సోదరుడు లచ్చయ్య, సిద్దం శంకర్, ఒడ్నాల బాపు కారణమని లేఖ రాసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# కేసులు తొలగేనా?

- పోడుభూముల కేసులు ఎత్తివేస్తామన్న సీఎం కేసీఆర్
- కోయపోచగూడ గిరిజనులకు అవకాశం దక్కేనా?



భూపోరాటం సమయంలో గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

**దండేపల్లి(మంచిర్యాల):** దండేపల్లి మండలం మాకులపేట పంచాయతీ పరిధిలోని కోయపోచగూడ ఆదివాసీ గిరిజనులు పోడుభూముల కోసం పోరాటాలు చేశారు. అటవీ భూముల్లో చెట్ల పొదలు నరికి నిప్పుపెట్టారు. వారి పోరాటాలను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలించారు. దీంతో గూడేనికి చెందిన సుమారు 12 మంది మహిళలు, 8మంది పురుషులపై గతంలో (2022లో) కేసులు నమోదయ్యాయి. అందులో మహిళలను అరెస్టు చేసి జైలుకు తరలించడం రాష్ట్రంలో అప్పట్లో చర్చనీయాంశమైంది.

**గిరిజనులపై కేసులు తొలగేనా?**

ఇటీవల సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. పోడు విషయంలో నమోదైన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రకటనతో తమపై నమోదైన కేసులు ఇక తొలగిపోతాయని, కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదని గిరిజనులు ఆశతో ఉన్నారు. అటవీ భూములను ఆక్రమించుకునే క్రమంలో నమోదైన కేసులు ఎత్తివేయక పోవచ్చన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా పోడుకేసుల ఎత్తివేతపై ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు వేచి చూడాల్సిందే మరి.

**మార్గదర్శకాలు వస్తేనే..**

పోడు కేసులు ఎత్తివేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కానీ కేసులు అనేవి కోర్టు పరిధిలోనివి. కేసుల ఎత్తివేత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. అందుకు తగ్గ మార్గదర్శకాలు విడుదల చేస్తే తప్పా ఏంచెప్పలేం. ఏదైనా ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలపైనే ఆధారపడి ఉంటుంది.

– మాధవరావు, ఎఫ్‌డీవో, జన్నారం

**చంటిపాపను వదిలి జైలుకు..**



భూపోరాటంలో భాగంగా నాపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. చంటిపాపను వదిలి వారం రోజుల పాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటికి వచ్చా. ఇప్పటికీ కోర్టుకు హాజరవుతున్నా. పోడు కేసులు ఎత్తివేస్తామని కేసీఆర్ సారు చెప్పిండ్రు. అది మాకు కూడా వర్తింపచేసేలా చూడాలి.

– దోసండ్ల సునీత, కోయపోచగూడ

**హక్కుపత్రాలు ఇవ్వాలి**



గిరిజనులందరం కలిసి సమీప అటవీ భూమిలో సాగు చేసేందుకు యత్నిస్తే అధికారులు అడ్డుకుని కేసులు పెట్టి జైలుకు తరలించారు. ప్రభుత్వం కోయపోచగూడ గిరిజనుల గోడును గుర్తించి, పోడు భూములకు పట్టాలు ఇచ్చినట్టుగానే, మాకు హక్కు పత్రాలిచ్చి ఆదుకోవాలి. మాపై పెట్టిన కేసులు ఎత్తేయాలి.

– మద్దికుంట రమేశ్, కోయపోచగూడ